పరీక్షా తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 21: ఓయూ పరిధిలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ మొదటి సెమిస్టర్ మెయిన్ పరీక్షా తేదీలను మార్చినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను ఈ నెల 26 నుంచి నిర్వహించనున్నట్లు గతంలో ప్రకటించినప్పటికి పలు కారణాల రీత్యా వాటిని వాయిదా వేసినట్లు చెప్పారు. పరీక్షలను తిరిగి వచ్చే నెల 1వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు.

- ఓయూ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 28 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఓయూ టెక్నాలజీ కళాశాలలో పార్ట్‌టైం లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింత సాయిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఫుడ్ టెక్నాలజీలో మూడు పోస్టులు, ఫార్మసీ విభాగంలో ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. యూజీసీ, ఏఐసీటీఈ నిబంధనల మేరకు అర్హతలు ఉండాలని స్పష్టం చేశారు. ముందుగా రాతపరీక్ష నిర్వహించి, డెమో క్లాస్ ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. దరఖాస్తులను ఈ నెల 22వ తేదీలోగా తన కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

- ఓయూ ఆర్ట్స్ కళాశాలలోని ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ సెంటర్ (ఈఎల్‌టీసీ)లో సర్టిఫికెట్ కోర్సుకు విదేశీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ కోర్సు తరగతులు రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు వరకు నిర్వహిస్తామని వివరించారు. ఆసక్తి ఉన్న వారు 9963528216, 9393059033 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు మరో నామినేషన్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ రెండో రోజు ఒక నామినేషన్ దాఖలైంది. తొలి రోజు బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు తొమ్మిది మంది నామినేషన్ దాఖలు చేశారు. ఆవుల రవీందర్ రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, కంది శైలజ, సబిహాబేగం, మన్నె కవితా రెడ్డి, లాస్య దూసరి, బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, చింతల విజయశాంతి, సబితా కిశోర్‌లు నామినేషన్ వేశారు. బీఆర్ఎస్‌లో ఉన్న అర్చన బుధవారం నామినేషన్ వేశారు. ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఆదివారం మినహా మిగిలిన రోజులు నామినేషన్లను అధికారులు స్వీకరిస్తారు.

నేడు,రేపు జాతీయ సదస్సు

మాదన్నపేట, ఫిబ్రవరి 21: సస్టైనబుల్ అగ్రికల్చర్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కోసం స్మార్ట్ టెక్నాలజీస్ పై ఈ నెల 22-23 న జాతీయ సదస్సును సంతోష్‌నగర్‌లోని క్రీడా(సీఆర్ఐడీఏ)లో హైదరాబాద్ ఇండియన్ సొసైటీ ఆఫ్ ఆగ్రోఫిజిక్స్, ఢిల్లీ ఐసీఆర్ -సీఆర్ఐడీఏ సంయుక్తంగా నిర్వహిస్తునట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

సోలార్ విద్యుత్ పథకం అమలుకు జాతీయ స్థాయిలో పోర్టల్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) :ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని దేశ వ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగానే ఢిల్లీలో దీనిపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారని తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు బుర్ర అశోక్ కుమార్ తెలిపారు.

గ్రేటర్‌లో లగ్జరీ రైడ్..

- మార్కెట్లోకి కొత్త ఫీచర్లతో వాహనాలు
- రూ.20 లక్షల నుంచి 7 కోట్లపైనే..
- గతేడాది 17,111 కార్లు..
- ప్రస్తుతం 3,768 కార్లు విక్రయం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : లగ్జరీ కార్లకు డిమాండ్ పెరుగుతుంది. నగర రోడ్లపై దూసుకుపోతున్నాయి. అత్యాధునిక ఫీచర్లతో కూడిన వాహనాలను కొనుగోలు చేయడానికి సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులు పోటీపడుతున్నారు. మార్కెట్లోకి కొత్త ఫీచర్లతో విడుదలైన వాహనాలు తమ గ్యారేజీలో ఉండాల్సిందే అన్నట్టుగా కోట్ల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణలో లగ్జరీ వాహనాలు ఎక్కువగా మహానగరంలోనే అమ్ముడుపోతాయి. ప్రపంచ నగరాల కంపెనీలు హైదరాబాద్‌లో బ్రాంచ్‌లు ఏర్పాటు చేయడం కూడా లగ్జరీ కార్ల అమ్మకాలకు ప్రోత్సాహం ఇస్తున్నట్టుగా నిపుణులు విశ్లేస్తున్నారు. కనీసం రూ.20 లక్షల నుంచి 7 కోట్ల వరకు విలువైన కార్లు అమ్ముడుపోతున్నాయి. గతేడాది రూ.20 లక్షలకు పైగా విలువ చేసే 17,111 కార్లు అమ్ముడుపోగా, ఈ ఏడాది ప్రస్తుతం వరకు 3,768 కార్లు అమ్ముడుపోయాయని అధికారులు చెబుతున్నారు. ఇతరులకు భిన్నంగా ఉండాలనే లక్ష్యంతో పాటు అందులో ఉండే భద్రతపరమైన అంశాలతో ఎక్కువగా ఖరీదైన కార్లను కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. గతేడాది ప్రముఖ బిజినెస్ మాయన్ కుమారుడు నజీర్‌ఖాన్ అనే వ్యక్తి రూ.7 కోట్లపైనే విలువజేసే ఎంసీల్యారెన్ 785 ఎల్‌టీ స్పైడర్ వాహనం కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా అల్లరి నరేశ్ రూ.68 లక్షల విలువ జేసే పీయూఈవీ6 వాహనం కొనుగోలు చేశారు.

రూ.20 లక్షల నుంచి రూ.7 కోట్లపై విలువజేసే కార్లు..

కంపెనీ	2022	2023	2024
జాగ్వార్ ల్యాండ్ రోవర్	250	270	228
అడి సిరీస్	195	210	147
బీఎండబ్ల్యూ	540	608	367
మెర్సిడెజ్ బెంజ్	1080	1450	709
టయోటా కిర్లోస్వర్	4301	4407	1250
వోక్స్‌వ్యాగన్	29	47	257
ఫోర్డ్	24	89	102
కియా	282	385	176
మహేంద్ర	537	3289	240
ఇతర కంపెనీలతో కలిపి మొత్తం	11,364	17,111	3,768

విద్యారత్న అవార్డుల ప్రదానం

విద్యారత్న అవార్డు గ్రహీతలతో హైకోర్టు జడ్జి సురేపల్లి నంద

రవీంద్రభారతి, ఫిబ్రవరి21: పలువురు సమాజ సేవకులకు విద్యారత్న 2024 అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ హైకోర్టు జడ్జి సురేపల్లి నంద విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి సమాజ సేవకులకు విద్యారత్న అవార్డు-2024 లను అందచేశారు. ఈ సందర్భంగా జడ్జి సురేపల్లి నంద మాట్లాడుతూ సమాజ సేవకులకు అవార్డులు ఇవ్వడం వల్ల మరింత ఉత్సాహంగా పని చేసి సమాజ ప్రగతికి పాటుపడుతారని అన్నారు. ఈ సందర్భంగా మదర్ ఫౌండేషన్ చైర్మన్ మల్లికార్జున్‌రావును అభినందించారు. ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మ, డాక్టర్ అశ్విత్ చవాన్,డీఎల్ పాండు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కమలాకరశర్మకు నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ ప్రొఫెసర్ రవీందర్

ఓయూ తెలుగు విభాగం హెడ్‌గా ప్రొ. కమలాకర శర్మ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 21: ఓయూ తెలుగు విభాగం హెడ్‌గా ప్రొఫెసర్ సాగి కమలాకర శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని వీసీ ప్రొఫెసర్ రవీందర్ చేతుల మీదుగా కమలాకర శర్మ స్వీకరించారు.

రేపు విజ్ఞాన్ జ్యోతి కళాశాలలో నేషనల్ సెమినార్

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 21: వెస్ట్ మారేడ్‌పల్లి లోని విజ్ఞాన్ జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిజిటల్ యుగంలో మహిళా 'పారిశ్రామిక వేత్తలకు సాధికారిత కల్పించడం' అనే అంశం పై నేషనల్ సెమినార్‌ను ఈ నెల 23వ తేదీన కళాశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా డైరెక్టర్ జనరల్ (జైళ్లు, కరెక్షనల్ సర్వీసెస్) ఐపీఎస్ అధికారి సౌమ్య మిశ్రా హాజరు కానున్నట్లు తెలిపారు. అదేవిధంగా కళాశాల సెక్రటరీ జేఎస్. రావు, ప్రెసిడెంట్ సురేశ్ బాబు, కళాశాల చైర్మన్ రాజశేఖర్, తదితరులు పాల్గొననున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెల్లడించారు.

విదేశాల్లో మాతృ భాషా దినోత్సవాన్ని నిర్వహించాలి

అమీర్‌పేట్, ఫిబ్రవరి 21 : ఎల్లలు దాటిన తెలుగు భాష కీర్తికి మరింత ప్రాచుర్యం తెచ్చేందుకు నాలుగేండ్లుగా ఈ నేలపై జరుగుతున్న మాతృ భాషా దినోత్సవాన్ని వచ్చే ఏడాది విదేశాల్లో నిర్వహించేలా చూడాలని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సి.హెచ్ విద్యాసాగర్‌రావు సూచించారు. అక్షరయాన్.. తెలుగు విమెన్ రైటర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని బేగంపేట్‌లోని హోటల్ ప్లాజాలో బుధవారం నిర్వహించారు. అక్షరయాన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు అయినంపూడి లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషకు అద్భుతమైన వ్యాకరణం ఉందని, మాతృ భాష నాయకత్వమే దేశాన్ని కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కవి అందెశ్రీకి పంప కవి బిరుదు ప్రదానం చేసి సత్కరించారు. దీంతో పాటు తెలుగు భాషాభివృద్ధికి పాటు పడుతున్న వంశీ రామరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి జొన్నలగడ్డ స్నేహజ, అక్షరయాన్ ఉపాధ్యక్షురాలు సమ్మెట విజయతో పాటు అక్షరయాన్ ప్రతినిధులు, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రచయితలు, కవులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

సాహితీవేత్త ఆచార్య నీలకంఠానికి సాహితీ పురస్కారం ప్రదానం చేస్తున్న శివారెడ్డి, చెన్నయ్య, సుజాతారెడ్డి

భారతీయ సంస్కృతికి ప్రతిబింబం సంస్కృత భాష

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 21: భారతీయ సంస్కృతికి ప్రతిబింబం ప్రాచీన సంస్కృత భాష అని సంస్కృత అకాడమీ సంచాలకుడు ఆచార్య కాశొజ్జల నీలకంఠం అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలంగాణ సారస్వత పరిషత్తులో ప్రముఖ సంస్కృత పండితుడు ఆచార్య ముదిగంటి గోపాల్‌రెడ్డి సాహితీ పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య నీలకంఠానికి ప్రదానం చేశారు. పురస్కారం కింద 25వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. పరిషత్తు అధ్యక్షులుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ప్రసంగిస్తూ సంస్కృత భాషా సాహిత్యాలలో గోపాల్‌రెడ్డి ప్రపంచ ప్రసిద్ధుడైన పండితుడిగా పేరు పొందారని అన్నారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య, ప్రాచీన రాతప్రతుల గ్రంథాలయం పూర్వ సంచాలకులు ఆచార్య శ్రీపాద సుబ్రహ్మణ్యం, గోపాల్‌రెడ్డి సతీమణి ప్రముఖ రచయిత్రి డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి పాల్గొన్నారు.

హస్త కళాప్రదర్శనను తిలకిస్తున్న రమా రాజమౌళి

ప్రాజెక్ట్ తరాషా ఎగ్జిబిషన్ ప్రారంభం

బంజారాహిల్స్,ఫిబ్రవరి 21: గ్రామీణ హస్తకళలను ప్రోత్సహించడంతో పాటు వారు తయారు చేసే ఉత్పత్తులను వినియోగదారులకు పరిచేయం చేసే లక్ష్యంగా బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు కొనసాగే ' ప్రాజెక్ట్ తరాషా' కళాకృతుల ప్రదర్శనను ప్రముఖ దర్శకుడు ఎస్ ఎస్.రాజమౌళి సతీమణి రమా రాజమౌళి బుధవారం ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఈనెల 24వరకు కొనసాగనున్నదని నిర్వాహకులు శ్రీధర్ తెలిపారు.

108 దివ్యదేశాల బ్రహ్మోత్సవాలు

శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ శ్రీరామనగరంలోని 108 దివ్యదేశాల ద్వితీయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు భక్తులకు చిన్నజీయర్‌స్వామి అన్నప్రసాదం చేశారు. బుధవారం ధ్వజారోహణ కార్యక్రమంతో ప్రారంభమై రామచంద్రాప్రభువుకి సూర్యప్రభ వాహన సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

- శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 21

యశోద ఆసుపత్రిలో వర్క్‌స్పేస్ డెస్క్‌లు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులకు కార్పొరేట్ సంస్థలు మెరుగైన మౌలిక వసతులను కల్పిస్తున్నాయి. తాజాగా హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల సహాయకులుగా ఉండే వారు ఉద్యోగులైతే వారు తమ కంపెనీ విధులు నిర్వహించేందుకు వీలుగా ఆస్పత్రిలో ప్రత్యేకంగా వర్క్‌స్పేస్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. కరోనా మూలంగా వర్క్ ఫ్రమ్ హోం విధానం అందుబాటులోకి రావడంతో ఐటీ ఉద్యోగులు ఇంటి నుంచి మాత్రమే కాకుండా ఎక్కడ ఉన్నా పనిచేసేందుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించుకుంటున్నారు.

మార్చి 10న జ్యోతిష్య అవార్డులు ప్రదానం

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 21: ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో, ఆర్యన్ ఆస్ట్రాలజీ రీసెర్చ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో జ్యోతిష్య రంగంలో రాణిస్తున్న వారికి మార్చి 10న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జ్యోతిష్య శిరోమణి, జ్యోతిష్య భీష్మ, జ్యోతిష్య విశారద, జ్యోతిష్య బ్రహ్మ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు డాక్టర్ నరసింహస్వామి తెలిపారు. అర్హులైన వారు ఈనెల 25వ తేదీలోపు 965 2475566 నంబర్‌లో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

హెచ్‌సీజీ ఆధ్వర్యంలో సైక్లింగ్ రైడ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : కశ్మీర్ టూ కన్యాకుమారి సైక్లింగ్ రైడ్ విజయవంతంగా మూడు సార్లు పూర్తి చేసిన సందర్భంగా హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్ (హెచ్‌సీజీ) సభ్యులు బుధవారం నెక్లెస్‌రోడ్డులో సైక్లింగ్ రైడ్ నిర్వహించారు. సైక్లింగ్‌ను ప్రోత్సహించడంలో భాగంగా మరిన్ని సైక్లింగ్ రైడ్‌లు నిర్వహించనున్నట్టు ఫౌండర్ రవీందర్ తెలిపారు. మార్చి 3న హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్ ఏడో వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

దుర్గం చెరువు దుస్థితి చూడండి..

రక్షణ చర్యలు తీసుకోవాల్సిందే.. అధికారులకు తేల్చి చెప్పిన హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి21 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరానికి కలికితురాయిగా చెప్పుకునే దుర్గం చెరువు పరిరక్షణకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదని హైకోర్టు తప్పుపట్టింది. ఆక్రమణలను అరికట్టడం, అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో అధికారులు వైఫల్యం చెందుతున్నారని మండిపడింది. దుర్గం చెరువు పరిరక్షణకు కార్యాచరణ ప్రణాళికను రాత పూర్వకంగా సమర్పించాలని అధికారులను ఆదేశించింది. దుర్గం చెరువు దుస్థితిపై నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను లోతుగా పరిశీలించాలని, చెరువు రక్షణకు కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని ఆదేశించింది. ఆ నివేదికను సమగ్రంగా పరిశీలించి చెరువు పునరుద్ధరణ, పరిరక్షణకు ప్రణాళికను తయారు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీలకు నోటీసులు జారీ చేసింది. అలాంటి అధికారులను ప్రభుత్వ న్యాయవాదులు సమర్థిస్తూ వాదనలు వినిపించడం సమర్థనీయం కాదని అభిప్రాయపడింది. తమ ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే ఆ రెండు శాఖల అధికారులను కోర్టు విచారణకు పిలిపించాల్సివస్తుందని హెచ్చరించింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ల పరిరక్షణ, చెరువులో పూడిక తీత, మురుగునీరు మళ్లింపు వంటి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. చెరువులోకి మురుగు నీరు, రసాయనాలు ఔషధ ప్యాక్టరీల వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా చెరువు కాలుష్యమై చెరువులో చేపలు చచ్చిపోయి నీటిపై తేలియాడుతున్నాయంటూ పత్రికల్లో వచ్చిన కథనాన్ని ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాదే జస్టిస్, అనిల్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ సందర్భంగా పైవిధంగా ఆదేశాలను జారీ చేసింది.

డైలీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, వివేక్ వెంకటస్వామి

దళితుల సమస్యలపై పోరాటం అభినందనీయం

కవాడిగూడ, ఫిబ్రవరి 21: రాష్ట్ర వ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ వారి సంక్షేమానికి షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన 2024 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, తెలంగాణ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు సుదర్శన్ బాబు ఆవిష్కరించారు. సంస్థ అధ్యక్షుడు సుదర్శన్ బాబు, ఆలిండియా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ జాతీయ అధ్యక్షుడు రాగాల నాగేశ్వర్ రావు, నర్సింగ్‌రావు, దాసరి రవీందర్, రుద్రారం శంకర్, వినోద్ కుమార్, చెన్నకేశవరావు, దాసరి యాదగిరి, శంకర్, విజయబాబు, కుర్మ మహేందర్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మారుతి జోషి, రామకృష్ణ, స్వామి సంతోష్ రంగనాయకులు

కండ్లకు గంతలు కట్టుకొని రామ్‌లల్లా దర్శనానికి..

ఖైరతాబాద్, ఫిబ్రవరి 21 : అయోధ్యదామంలో కొలువుదీరిన రామ్‌లల్లాను దర్శించుకునేందుకు ఇద్దరు మెజీషియన్లు అరుదైన ఫీట్‌కు శ్రీకారం చుట్టారు. నగరానికి చెందిన ప్రముఖ మెజీషియన్లు మారుతి జోషి, రామకృష్ణ కండ్లకు గంతలు కట్టుకొని మోటర్ సైకిల్‌పై వందలాది కిలోమీటర్లు ప్రయాణించి స్వామి వారి దర్శనానికి బయలుదేరనున్నారు. బుధవారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్వామి సంతోష్ రంగనాయులతో కలిసి వివరాలను వెల్లడించారు. ఈ నెల 23న ముచ్చింతల్‌లోని సాకేత్‌దామం నుంచి ఉదయం 9గంటలకు తమ యాత్రను శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయరు స్వామి ప్రారంభిస్తారని తెలిపారు.

షోల్డర్ జాయింట్ రిప్లేస్‌మెంట్‌పై కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రిలో సదస్సు

బేగంపేట్ ఫిబ్రవరి 21: షోల్డర్ జాయింట్ రిప్లేస్‌మెంట్‌లో అధునాతన పద్ధతుల గురించి సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో బేగంపేట్‌లోని కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రిలో బుధవారం కాన్ఫరెన్స్ నిర్వహించారు. షోల్డర్ సర్జన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కాన్ఫరెన్స్‌లో సన్‌షైన్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ గురువారెడ్డి, ప్యారిస్‌కు చెందిన ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన షోల్డర్ సర్జన్ డాక్టర్ జీన్‌గ్రిమ్బెర్గ్ పాల్గొన్నారు. ఈ సదస్సులో సుమారు వంద మంది ఆర్థోపెడిక్ సర్జన్స్ పాల్గొన్నారు.

సన్‌షైన్ ఆసుపత్రిలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న వైద్యులు డాక్టర్ గురువారెడ్డి